క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం వారికి క్విజ్ పోటీలను ఏటా నిర్వహిస్తున్నామని ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు అన్నారు. నగరంలోని అనురాగ నిలయంలో ఉన్న విద్యార్థులకు క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథం నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పిల్లలకు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సీనియర్ సభ్యులు కొమ్ము రమణమూర్తి, మోహన్, ఆహ్వానితుడు తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభ అవార్డుకు పాత్రునివలస స్కూల్ ఎంపిక



మెమెంటోలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది, నాయకులు

శ్రీకాకుళం రూరల్: పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావు శుక్రవారం తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరం నుంచి జాతీయ, రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినందుకు అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యాకమిటీ చైర్మన్ పంచిరెడ్డి నర్సింహులు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు చేతులు మీదుగా విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.సతీష్‌నాయుడు ఉన్నారు.

కవితల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అర్చన

శ్రీకాకుళం రూరల్: గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థిని శిమ్మ అర్చన రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో బహుమతి గెలుకున్నట్లు ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిడుగు జయంతి సందర్భంగా విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన కవితలో పోటీల్లో ప్రతిభ కనబర్చడం ద్వారా బహుమతి సాధించినట్టు పేర్కొన్నారు. ప్రముఖ కవి, కథకులు గంటేడ గౌరినాయుడు నుంచి బహుమతి స్వీకరించినట్టు చెప్పారు. అర్చనను విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు, సిబ్బంది అభినందించారు.

న్యాయం ముందు అందరు సమానమే



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయం ముందు అందరూ సమానులేనని, ప్రతి ఒక్కరికీ సమాజంలో న్యాయం జరగాలని, అందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తోందని జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక ఆర్‌సీఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం విధి విధానాలు తెలుసుకోవాలని, విద్యార్థి దశలోనే ప్రాథమిక చట్టాలను అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్, ఎం.శశికళ, కరెస్పాండెంట్ ఎం.శాంతి పాల్గొన్నారు.

అండర్-9 చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నానుబాల వీధిలో ఉన్న చెస్ కోచింగ్ కేంద్రంలో ఆదివారం జిల్లాస్థాయి అండర్-09 బాలబాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, ప్రధాన కార్యదర్శి జామి రమేష్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి జరగనున్న ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2015 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా క్రీడాకారులను విజయనగరం వేదికగా సెప్టెంబర్ 21, 22 తేదీల్లో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పంపిస్తామన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఎంట్రీఫీజుగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 74168 64642 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం!

పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోలు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నాయి. ఏమాత్రం భద్రతా చర్యలు చేపట్టకుండానే ఆటో డ్రైవర్లు పిల్లలను తీసుకొని రయ్‌మంటూ తీసుకొని వెళ్తున్నారు. వర్షాలు కురుస్తున్నాయి. నల్లని తారు రోడ్లు వర్షపు నీటితో నిగనిగలాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాహనాల టైర్లు చిన్నపాటి బ్రేక్ వేసినా స్కిడై అదుపు తప్పుతుంటాయి. అలాంటిది బండెడు పుస్తకాలు, ఆపై వెనుక డోర్లలో చిన్నారులు కిక్కిరిసి ఆటోలో ప్రయాణిస్తుండటం ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నట్టు ఉంది. స్పీడ్‌బ్రేకర్లు, గుంతల్లో ఆటోలు దూసుకుపోతుంటే ఎలాంటి ప్రమాదం ముంచుకువస్తుందనోననే భయం చూసేవాళ్లకి అనిపిస్తోంది. జిల్లాకేంద్రం సమీపంలో పెదపాడు వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఆటోల్లో ప్రమాదకరంగా శుక్రవారం వెళ్తున్న పిల్లలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

-శ్రీకాకుళం క్రైమ్



ఆటో వెనుక డోరులో కిక్కిరిసి కూర్చున్న విద్యార్థులు



జారిపడితే ప్రమాదమే కదా..



పిల్లలతో వరుసగా వెళ్తున్న ఆటోలు



కేంద్రీయ విద్యాలయ గేటు వద్ద ఇలా..

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



శ్రీకాకుళం అర్బన్: జిల్లా పరిషత్ ఆవరణలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ పిరియా విజయ, సిబ్బంది

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని వక్తలు అన్నారు. మానవ మనుగడ సైతం మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని చెప్పారు. 'వనం-మనం'కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీలు తదితర చోట్ల వివిధ రకాల మొక్కలను నాటారు. వీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం రూరల్: పెదపాడు గురుకులంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి



ఎచ్చెర్ల: లావేరు ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు



జి సిగడాం: దేవరవలసలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు



ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలో వన మహోత్సవ ర్యాలీ



ఎచ్చెర్ల: కస్తూర్బా పాఠశాలలో మొక్కలను నాటుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండలం ముద్దాడలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు



ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు



జి.సిగడాం: మోడల్ స్కూల్లో మొక్కలు నాటుతున్న ఎంఈఓలు, ప్రిన్సిపాల్, సిబ్బంది

'ఒకటో తేదీన సీపీఎస్ వ్యతిరేక దినంగా పాటించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: సీపీఎస్ వ్యతిరేక దినంగా సెప్టెంబర్ ఒకటో తేదీని పాటించాలని ఏపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలను కోరారు. పాత తాలూకా కేంద్రాల వద్ద నిరసన ప్రదర్శనలు జరపాలని ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పేర్లతో ఉద్యోగులను ప్రభుత్వాలు వంచిస్తున్నాయని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లింగనిర్ధారణ నేరం



మాట్లాడుతున్న వైద్యాధికారి సుజాత

జలుమూరు: లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అచ్యుతాపురం వైద్యాధికారి పూజారి సుజాత అన్నారు. శుక్రవారం కరకవలసలో లింగనిర్ధారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు వద్దు అనడం కూడా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకుల బదిలీ

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులకు బదిలీ అయినట్లు ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధ్యాకులు బి.రాజేశ్వరరావు రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీర్ అధ్యాపకులు పి.శరత్‌బాబుకు విశాఖపట్నంలోని పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయిందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటరు బిగిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు బిగిస్తున్నట్లు నరసన్నపేట ఏడీ ఇందిర శుక్రవారం తెలిపారు. అదానీ కంపెనీకి చెందిన ప్రతినిధులు వచ్చి స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రస్తుతానికి పది మీటర్లు వచ్చాయన్నారు. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో మొదట మీటరును బిగించామన్నారు. 500 యూనిట్లు పైబడి వాడిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించే అవకాశం ఉందన్నారు. నరసన్నపేట ఏఈ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ ప్రాథమిక కేంద్రం పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.శేషగిరి ఆధ్వర్యంలో జ్వరాలు, ఇతర అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13 సచివాలయాల పరిధిలోని 48 గ్రామాల్లో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, ఇంటింటికీ తిరుగుతూ సర్వేలు నిర్వహిస్తున్నట్లు హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. గృహాసందర్శన సమయంలో జ్వరంతో బాధపడుతున్నవారి వివరాలను నమోదుచేసి ప్రాథమిక చికిత్స అందించడంతోపాటు అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం జరిగిందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగటం వల్ల, ఇంటి చుట్టుపక్కల వర్షం నీరు నిల్వ లేకుండా చూడటం వల్ల టైఫాయిడ్, కామెర్లు, అతిసార, డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తూ చిన్నారులకు ఆరోగ్య తనిఖీలను నిర్వహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఏ గ్రామంలోనైనా జ్వరబాధితులు నమోదైతే వెంటనే ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారితో కూడిన రేపిడ్ రెస్పాండ్ టీమ్ వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాధుల తక్షణ నిర్ధారణకు రేపిడ్ డయాగ్నోసిస్ టెస్టు కిట్, స్టెయిడింగ్ మెథడ్, ఎన్ఎస్ 1 కిట్లతో పరీక్షించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు.



పెయ్యిలవానిపేటలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అపూర్వ కలయిక

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ప్రతిభా రెసిడెన్షియల్ స్కూల్‌లో 1992-93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక పట్టణంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నాటి తీపి గుర్తులు, చెరగిపోని స్నేహబంధాలు, అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. డ్యాన్సులు, ఆట పాటలతో సందడి చేశారు. చదువు చెప్పిన టీచర్లు తంగి జనార్దనరావు, ఆనందరావులను సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో ఇప్పిలి సందీప్ శర్మ, సతీష్, మిన్నారావు, డాక్టర్ వివేకానంద ఉన్నారు.



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ఆదుకోండి..

- రూ.30 వేల ఆర్థికసాయం చేసిన యువకులు



చికిత్స పొందుతున్న బుల్లోడు



బుల్లోడు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న యువత

రణస్థలం: మండలంలోని కొవ్వాడకు చెందిన మైలపల్లి హరిస్వామి (బుల్లోడు) గాయపడి ప్రాణప్రాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. హరిస్వామి ఇటీవల గుజరాత్ రాష్ట్రంలోని వీరావళికి బతుకు దెరువు కోసం మత్స్యవేటకు వలస వెళ్లాడు. అక్కడ వేట చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బోటులో పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కోమాలో ఉన్నాడు. సుమారు ఐదు లక్షల వరకు వైద్యానికి ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. భార్య, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన యువత తలో కొంత మొత్తం వేసుకుని రూ.30 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. దాతలు ఆర్థిక సాయం (ఫోన్‌పే నంబర్ 83742 65821) చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి గణపతి విగ్రహాలు



మట్టి గణపతి విగ్రహాన్ని తయారుచేస్తున్న రామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధానంగా వినాయక చవితికి మట్టి వినాయకుడిని పూజిస్తున్నారు. పొన్నాడ గ్రామ పంచాయతీ పాత పొన్నాడలో కొన్ని కుటుంబాలు మట్టి గణపతి ప్రతిమలను ప్రతి ఏటా తయారుచేసి విక్రయిస్తున్నారు. కెమికల్స్, రంగులు వాడకుండా బంకమట్టి, గడ్డి, కొబ్బరి మట్టలతో విగ్రహాలను తయారు చేస్తున్నారు. గిట్టుబాటు ధరతో సంబంధం లేకుండా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తయారీదారుడు రామకృష్ణ తెలిపారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు

టెక్కలి: ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని.. తక్షణమే స్పందించి ఎరువులు అందజేయాలని రైతులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి తహసీల్దారు దిలీప్ చక్రవర్తికి విన్నవించారు. యూరియా కావాలంటే ఇతర మందులు కొనుగోలు చేయాలని కొర్రీలు వేస్తున్నారని వాపోయారు. ఎరువుల డీలర్లు వారికి ఇష్టమైన ఎరువులను రైతులకు అంటగడుతున్నారని దీని వలన అత్యధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఎన్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, జి.నారాయణరావు, టి.తవిటయ్య, కైలాస్, గవరమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



సంతోషిమాతకు హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కుంకుమార్చనలు, దర్శనాలతో సందడి వాతావరణం నెలకొంది. చిందత్తనాథ క్షేత్రంలో వెలసిన గాయత్రీ మాతకు సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అమ్మవారికి రాహుకాల దీపాలతో పూజలు జరిగాయి. పాత శ్రీకాకుళంలో వెలసి శ్రీసంతోషిమాత అమ్మవారి ఆలయంలో, బలగలోని అయ్యప్పస్వామి దేవాలయంలో, బలగలోని నాగావళి తీరంలో ఉన్న లలితా త్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో, పాండ్రంగి వీధిలోని కామాక్షి అమ్మవారి పీఠంలో పూజలు జరిగాయి.



అయ్యప్ప ఆలయంలో మహాలక్ష్మికి పూజలు



బలగలో సామూహిక కుంకుమ పూజలు



గాయత్రి మాతకు అలంకరణ